# అభిమాన సినీతార

రైలు నెమ్మదిగా పోతోంది. అప్పుడే వానజల్లు కొద్దికొద్దిగా మొదలెట్టింది. ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులో కూర్చొని వున్న మధు పేపరు మడుస్తూ కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు. వానజల్లు కాస్త పెద్దదయింది. మధుకు, పక్కనే హాండ్ బాగ్‌ను తలగడలా పెట్టుకు నిద్రపోతున్నది సావిత్రి. చిన్న జల్లు కిటికీలోనుంచి లోపలికి కొట్టింది. సావిత్రి నెమ్మదిగా కళ్లు తెఱచింది. మధువేపు చూస్తూ లేచి కూర్చుంది. ఆమెచూపుల్లో ఆంతర్యాన్ని గ్రహించిన మధు నవ్వుతూ లేచి కిటికీ అద్దం దించాడు.

"ఇంకా బెజవాడన్నా రాలేదేమిటి ?" ఒళ్లు విరుచుకుంటూ తన వాచి వైపు చూచుకుంటూ అంది సావిత్రి. "అప్పుడే 4 గంటలయింది."

"మనస్సంత వేగంగా పోదుగా ట్రెయిన్ !" చిన్నగా నవ్వాడు మధు.

"అలా పోతే ఈ సరికి హైదరాబాబు పోయుండేవాళ్ళమేగా"... ఆత్మాభిమానం గాయపడ్డం ఇష్టంలేక అంది సావిత్రి.

"ఎలా అయినా పుట్టిల్లంటే ఎందుకనో అంత ప్రేమ ఆడాళ్ళకి ?"

"మగవాళ్లంత కృతఘ్నులు కారు గాబట్టిఆడవాళ్లు..." బాణంలా వచ్చింది జవాబు.

"ఓహో !" ఎగతాళిగా పక్కనుండే పేపరు తీసుకున్నాడు మధు ఆమె తీవ్రమైన దృష్టినుంచి తప్పించుకోడానికి.

కంపార్ట్ మెంటులో అదృష్టవశాత్తూ ఇంకెవ్వరూ లేనందువల్ల ప్రాణం హాయిగా ఉంది సావిత్రికి. లేచి టాయిలెట్ బాక్స తీసి సోప్ బాక్స తీసుకుంది సావిత్రి.

"సినిమా తారలకు సౌందర్యమునిచ్చు లక్స టాయిలెట్ సబ్బునే ఎల్లప్పుడూ వాడుడు..." మధు పెద్దగా చదివాడు. వినిపించుకోకుండా విసురుగా వెళ్ళింది బాత్‌రూమ్ వేపు సావిత్రి. 5 నిముషాల్లో ముఖం కడుక్కొని టవల్ తో తుడుచుకుంటూ వచ్చింది సావిత్రి.

"తర్వాత కార్యక్రమం..." ఎగతాళిగా అన్నాడు మధు.

"జడ వేసుకోడం." ఉక్రోషంగా అంది సావిత్రి. టాయిలెట్ బాక్సును తీసుకుని మధుకు ఎదురుగ్గా వున్న బెర్తు మీదకు వెళ్ళి కూర్చుని మొదలెట్టింది మేకప్.

"కాస్త త్వరగా కానిస్తే... స్టేషన్ వస్తోంది" వినయం చిందించాడు మధు. "అలాగే." వూహించనంతటి నెమ్మదిగా వచ్చింది జవాబు.

బెజవాడ స్టేషన్లో ట్రెయిన్ ఆగింది. తుంపర తుంపరగా పడ్తోంది వాన.

"అబ్బ ! ఎంత రష్‌గా వుంది స్టేషన్ !... నే నెప్పుడూ చూళ్ళేదు ఇంత రష్‌గా వుండటం !" సావిత్రికళ్ళు పెద్దవిచేస్తూ మధు వేపు తిరిగింది.

సూయజ్ కాలవ సమస్యను సీరియస్‌గా చదువుతున్న మధు తప్పనిసరిగా పేపర్లోంచి తల పైకెత్తాడు. కొద్దిగా ఆశ్చర్యపడి, ఆశ్చర్య పడ్డట్టు కనిపించకుండా కిటికీ పక్కన కూర్చున్నాడు బయటికి చూస్తూ.

స్టేషన్ చాలా క్రిక్కిరిసివుంది. మూ డే ళ్ళ పి ల్ల ల దగ్గర్నుంచి ఎనభై ఏళ్ళ ముసలివాళ్ళదాకా వున్నారు ఆ జన సమూహంలో. అందరూ దేనికోసమో వెదుకుతున్నట్టుగా వున్నారు. యువకులు, కా స్త బలంగలవాళ్ళు ట్రెయిన్ మీదికి తోసుకొస్తున్నారు. అక్కడక్కడా ఎ ర్ర టో పీ లు కూ డా కనిపిస్తున్నయ్.

తమాషాగా తల బయటికి పెట్టి చూస్తున్న సావిత్రి జనమంతా తమ పెట్టెవేపే రావటంచూచి కా స్త వెనక్కు సర్దుకుని కూర్చుంది. అప్పుడే జనంలోనుంచి "అదుగో... సురేఖ" అనేక కంఠాలు కొన్ని వందల మార్లు వినిపించాయ్.

నిముషంలో ఆ ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్ చుట్టూ ఇసక వేస్తే రాలకుండా నిండిపొయ్యారు జనం.

జనంలోనుంచి తోసుకుంటూ ఓ స్థూలకాయుడు-షుమారు 45 ఏళ్ళుంటాయ్—తెల్లని గ్లాస్కో పంచ, లాల్చీ, పైన జరీ కండువా, చేతిలో పూలదండతో గబగబా కంపార్టు మెంట్‌లోకి ఎక్కాడు.

జనం పెట్టెచుట్టూ మూగగానే మధు కాస్త ఆందోళన పడ్డాడు. అర్థంకాక అలా చూస్తున్న మధు, ఆయనను చూచి మరీ ఆశ్చర్యపడ్డాడు. వస్తూనే ఆయన, "నా పేరు టి. కృష్ణన్, కృష్ణా పిక్చర్ ప్యాలెస్ మేనేజర్ని, ఓనర్నుకూడా నేనే. మీరిక్కడికి 'పరాజయం' పిక్చరు శతదినోత్సవాలకు ఈ రోజు రావటానికి అంగీకరించారని మూడురోజుల క్రిందటే తెలిసి అన్ని ఏర్పాట్లూ చేసి ఉంచాను."... గుక్క తిప్పుకోటానికి ఆగి జవాబు ఆశించకుండానే మొదలెట్టాడు. 'సురేఖగారి అభిమానులంతా ఈ జనంలో వున్నారు. దయచేసి మా కోర్కె కాదనకుండా థియేటరుకు వెళ్దాం రండి. కారు రెడీగానే ఉంది. ఏమండీ రామంగారూ ? మీరూ సురేఖగారూ బయటకు వస్తే జనం చూచి ఆనందిస్తారు...' గొంతు సవరించుకుని మళ్ళీ అన్నాడు కృష్ణన్. 'మిమ్మల్ని పుష్పమాలాలంకృతుల్ని చేసి తీసికెళ్దామని...' ఇక ఆనందంతో మాట్లాడలేక పోయాడు కృష్ణా పిక్చరుప్యాలెస్ మేనేజరు కృష్ణన్.

జనంలోంచి 'సురేఖగారూ దయచేసి బయటికి రండి' అనే కేకలు వినపడ్తున్నయ్. ఎవరికో లోపలుండే వ్యక్తులు సరిగ్గా అగుపడక కాబోలు కిటికీ అద్దం ఎత్తేశారు. సావిత్రిని ఆపాదమస్తకం తిలకిస్తున్నారు. జనంలో కొందరికి ఒంటిమీద స్పృహకూడా బొత్తిగా పోతోంది.

మధుకు పరిస్థితి అర్థంచేసుకోటానికి అరనిముషంపట్టలా!

సావిత్రి నిశ్చేష్టురాలై బెర్తుమీద మూలగా ఒరిగి కూర్చుంది.

మధు, కృష్ణన్ భుజంమీద నెమ్మదిగా తట్టూ అన్నాడు: 'సర్ ! మీరు పొరబడ్డారు. నా పేరు మధు. ఆవిడ నా వైఫ్ సావిత్రి. మేము మీ రనుకుంటున్న.........'

కృష్ణన్ పెద్దగా నవ్వాడు.

"రామంగారూ ! ఇంతకు ముందులా మమ్మల్ని నిరాశ పరచి మారుపేర్లతో వెళ్ళిపోదామని చూస్తున్నారా ? మీరు ఎంత కాదన్నా ఆవిడ సురేఖాదేవే, మీరు వారి పర్సనల్ అసిస్టెంట్ రామంగారే. దయచేసి మా కోరిక నెరవేర్చండి."

చూచే జనానికి ఇక ఓపిక లేకపోయింది. అందాకా ఇంకా బయటికి వస్తుంది, ఇంకా బయటికి వస్తుంది అని వెయిట్ చేస్తున్నవాళ్ళల్లా కాస్త ఉద్రేకంగా ముందుకు వచ్చారు.

మధు ఇట్టే గ్రహించాడు రానున్న పరిస్థితిని.

కొయ్యబొమ్మలా గుడ్లు మిటకరించి చూస్తున్న సావిత్రిని చూచి జాలిపడ్డాడు.

కాస్త హెచ్చుస్థాయిలో అన్నాడు కృష్ణన్‌తో:

'కృష్ణన్ గారూ! మొదట ఇక్కడికి వచ్చిన జనంతో కాస్తమాట్లాడి తర్వాత థియేటరుకు పోదాం!'

కృష్ణన్ ఎగిరి గంతేశాడు. వెంటనే పక్కనుండే తన అసిస్టెంట్‌తో నెమ్మదిగా ఏదో చెప్పాడు. అతను పెట్టెతలుపు దగ్గరికివచ్చి అక్కడ కిక్కిరిసివున్న యువకులతో ఏదోచెప్పాడు.

వైర్‌లెస్‌లా ఆవార్త ఏమిటో స్టేషనంతా పాకిపోయి నిశ్శబ్దత ఆవరించింది ఒక్కసారిగా.

మధు, సావిత్రికి దగ్గరగా వెళ్ళి అప్పటి పరిస్థితిని ఆమె చెవిలో చెప్పాడు. చెయ్యాల్సిన కార్యక్రమం హింట్స్‌లా వివరించాడు.

సావిత్రి, మధు మాట్లాడుకోటం జనం వింతగా చూస్తున్నారు. సినిమాతార సురేఖ మాట్లాడ్తే ఎలా వుంటుందోనని చెవులు రిక్కించుకుని వింటున్నారు.

సావిత్రి, మధు తలుపు దగ్గరికొచ్చి నిలబడ్డారు.

ఇద్దరూ జనానికి నమస్కరించారు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అయిదారుగురు ఫొటోగ్రాఫర్‌లు వచ్చి ఇట్టే స్నాప్స్ తీసేశారు. మళ్ళీ వెనక్కు సర్దుకున్నారు. మధు గొంతు సవరించు కుంటూ మొదలెట్టాడు:

"మహాజనులారా! దయచేసి నేను చెప్పబోవునది శాంతంగా వినగోరుతాను. మీరు సినీతార సురేఖపట్ల చూపించు ఆదరాభిమానాలకు నా కెంతో సంతోషంగావుంది. కాని నేనీ విషయం మీకు తెలియపర్చుటకు ముందు చాలా విచారిస్తున్నాను. ఈ విడ మీ రనుకుంటున్న సినీతార సురేఖ కాదు. సావిత్రి ... నా భార్య. నా పేరు మధు..." జనంలో కలకలం బయల్దేరింది. అందరిదృష్టి సావిత్రిమీద వుంది.

ఇంతలో మధుమాటలు వినిపించకుండా నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ "మహాశయులారా'' అంటూ ఓ పెద్దకేక వినబడింది. అందరి కండ్లు, చెవులు అటువేపు మొగ్గాయి. స్టేషనుకు ఓ మూలవైపునుంచి పూలతో అలంకరించిన ఓ కారుమీద

లౌడ్‌స్పీకర్ ఇలా వాగింది పెద్దగా: "సినీతార శ్రీమతి సురేఖ, ఆమె పర్సనల్ అసిస్టెంట్ రామం, నళిని, జయ, మూర్తి మొదలైన సినిమాయాక్టర్లు వాణీవిలాస్‌లో ఇప్పుడే దిగారు...." కారు సాగిపోయింది.

మంత్రముగ్ధుల్లా జనం స్టేషన్ కటకటాలను, పోలీసులను గూడా లెక్క చెయ్యకుండా స్టేషన్ బయటికి పరుగెత్తారు.

మధు వెనక నిల్చునివున్న కృష్ణన్ ఒక్కసారిగా మధును తోసుకుని ప్లాట్‌ఫారమ్ మీదికి దూకాడు.

అంతదాకా పచ్చజెండా వూపితే ఏం ప్రమాదం తన మీదికి ముంచుకొస్తుందోనని తటపటాయిస్తున్న గార్డు, ప్రాణం అంతా బిగపట్టి విజిల్ వేశాడు.

గమ్యస్థానం చేరుకోటానికి గంభీరంగా కూతకూస్తూ, స్టేషన్నుంచి బయల్దేరింది ట్రెయిన్. క్షణంలో స్టేషన్ ఖాళీ అయింది.